
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | 5



వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం

రూ.1.34 కోట్లు

30 గ్రాముల బంగారం, కిలో వెండి, 34 విదేశీ కరెన్సీ నోట్లు..

వార్త..6లో

రేపటి నుంచి గొల్లవిల్లిలో

ఆలిండియా మెన్స్ వాలీబాల్ పోటీలు

ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న జాతీయ మహిళా జట్ల పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న రమణబాబు తదితరులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆలిండియా మెన్స్ డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు ఈ నెల 26 నుంచి 4 రోజుల పాటు నిర్వహించనున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తెలిపారు. అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ టోర్నమెంటు పేరిట ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో కస్టమ్స్ ముంబై జట్టు, ఇన్‌కమ్ ట్యాక్సు అహ్మదాబాద్ (గుజరాత్) జట్టు, ఎన్‌సీఓఈ త్రివేండ్రం (కేరళ) జట్టు, ఈస్టర్న్ రైల్వేస్ (పశ్చిమబెంగాల్), ఇండియన్ బ్యాంకు (చెన్నై), ఐసీఎఫ్ తమిళనాడు జట్లు పాల్గొంటాయన్నారు. అమలాపురం టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో టోర్నమెంటు కమిటీ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ మాట్లాడుతూ గొల్లవిల్లిలో మూడు దశాబ్దాలుగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి నుంచి ప్రారంభమైన ఈ పోటీలు రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి పోటీల స్థాయికి ఎదిగాయన్నారు. గతంలో మాజీ మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలను గొల్లవిల్లిలో నిర్వహించామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చూపడంతో పోటీలు నిలిచిపోయాయన్నారు. తిరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పోటీలను పునఃప్రారంభించామని చెప్పారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీల్లో చివరి రెండు రోజుల్లో ఉమెన్స్ డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు కూడా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఇందుకోసం ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ మహిళా జట్లు ముందుకు వచ్చినట్లు చెప్పారు. షెడ్యూల్‌లో ఉమెన్స్ వాలీబాల్ పోటీలు ప్రకటించకపోయినప్పటికీ మార్పులు చేసి ఆ పోటీలను కూడా కొనసాగిస్తామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, సంయుక్త కార్యదర్శి గుత్తాల సుభాష్ చంద్రరావు, ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ, ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం కాసు, గొలకోటి రాజా పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సమయానికి రాలేదని

కార్యాలయానికి తాళాలు..



పరిస్థితి పర్యవేక్షిస్తున్న ఎస్ఐ హరికోటిశాస్త్రి

మండపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సమయానికి రాకపోవడంతో ఆగ్రహం చెందిన కక్షిదారులు కార్యాలయానికి తాళం వేశారు. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ సెలవు పెట్టడంతో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీతకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఆమె కార్యాలయానికి రాలేదు. దీంతో వేచి ఉన్న కక్షిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారి లేనప్పుడు కార్యాలయం ఎందుకని కిందిస్థాయి సిబ్బందిని నిలదీసి కార్యాలయానికి తాళాలు వేయాలని ఆదేశించడంతో వారు తాళాలు వేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి సబ్ రిజిస్ట్రార్ కార్యా లయం వద్దకు చేరు కున్నారు. తాళాలు తీయించారు. అప్పటికే కార్యాలయానికి చేరుకున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సునీత మాట్లాడుతూ తనకు ఆరోగ్యం బాగాలేనందున ఆసుపత్రికి వెళ్లటం వల్ల కార్యాలయానికి వేళకు రాలేకపోయానని చెప్పారు. కొంతమంది తమ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయటంతో భయపడి కార్యాలయం గేటుకు తాళం వేశారని చెప్పారు. ఇక్కడ జరిగిన సంఘటనపై జిల్లా రిజిస్ట్రార్‌కు వివరించానని తెలిపారు.

అదనపు చార్జీలను వసూలు చేయొద్దు

- డబ్బులు ఎక్కువ వసూలు చేస్తున్నారని
- వినియోగదారుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయి
- రశీదులో సొమ్ము మాత్రమే తీసుకోవాలి
- గ్యాస్ డెలివరీ సిబ్బంది, ఏజెంట్లతో జేసీ నిషాంతి

అమలాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి 1వ తేదీ నుంచి గ్యాస్ డోర్ డెలివరీలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారనే మాట వినపడకూడదని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న 31 ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, డోర్ డెలివరీ సిబ్బందితో సోమవారం గోదావరి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మేలు చేకూర్చాలనే ప్రధాన సంకల్పంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఇటీవల ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారుల నుంచి అదనపు డోర్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నారని, ఐవీఆర్‌ఎస్, వాట్సాప్ క్యూఆర్ కోడ్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా జిల్లాలో పలువురు వెల్లడించినట్టు ఆమె తెలిపారు. రశీదులో ముద్రించిన సొమ్మును మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. అదనపు సొమ్ములు వసూలుచేస్తే టోల్‌ఫ్రీ నంబరు 1967కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆదేశాలు పాటించని పక్షంపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దుచేస్తామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాలసరస్వతి మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు వారికిచ్చిన రశీదులో ముద్రించిన ధర కంటే అదనంగా సొమ్ములు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎవరికో..

- ఎన్నిక షెడ్యూల్ జారీ
- మార్చి 20న పోలింగ్.. ఫలితాలు
- ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ
- 29 వరకూ ఎమ్మెల్సీగా యనమల
- మళ్లీ పొడిగింపు లేనట్లే?
- జిల్లా నుంచి ఎవరికి దక్కేనో
- ముందువరుసలో వర్మ
- పవన్ కోసం సీటు త్యాగం
- తొలి ఎమ్మెల్సీకి బాబు హామీ
- జనసేన నుంచి నాగబాబు
- ఆశావహుల ప్రయత్నాలు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీ కాలం వచ్చే నెల్లో ముగియనుండడంతో ఈ స్థానాలకు కొత్తగా ఎన్నిక నిర్వహించేందుకు వీలుగా సోమవారం షెడ్యూల్ జారీ అయింది. ఎమ్మెల్సీ పదవి కోసం అప్పుడే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆశావహుల సందడి పెరిగింది. పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు నేతలు తెరవెనుక ప్రయత్నాలు ఆరంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడి పదవీ కాలం ముగుస్తుండడంతో ఆయనకు పొడిగింపు ఛాన్స్ లేనట్లేనని పార్టీ ఇది వరకే సంకేతాలు పంపింది. దీంతో ఉమ్మడి జిల్లా కోటా కింద ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన నుంచి నాగబాబుకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి కట్టబెడతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎవరిని వరిస్తాయో చూడాల్సిందే మరి.

యనమలకు చాన్స్ లేనట్లే..

తుని నుంచి మాజీ మంత్రి యనమల ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో ఈయనకు మంత్రి పదవి ఖాయమని ప్రచారం జరిగింది. కానీ ఈసారి ప్రభుత్వంలో యువ నేతలకు చాన్స్ ఇవ్వాలన్న టీడీపీ సిద్ధాంతం నేపథ్యంలో సీనియర్ అయిన యనమలకు అమాత్య పదవి దూరమైంది. అయితే ఎమ్మెల్సీ పదవి ఎలాగూ ఉండడంతో పెద్దగా యనమలకు ఇబ్బంది రాలేదు. పైగా ఎన్నికల్లో యనమల కుటుంబానికి ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ సీట్లు పార్టీ కట్టబెట్టింది. దీంతో ఇప్పుడు యనమల తనయురాలు దివ్య తుని ఎమ్మెల్యేగా, అల్లుడు ఏలూరు ఎంపీగా ఉన్నారు. వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇలా యనమలతో కలిపి ఆయన కుటుంబానికి చెందిన మొత్తం నలుగురు వివిధ పదవుల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం యనమలకు ఉన్న ఎమ్మెల్సీ పదవి మార్చి 29వ తేదీతో ముగుస్తోంది. కానీ ఆయనకు తిరిగి ఈ పదవిని మళ్లీ కొనసాగించే అవకాశం లేదని పార్టీ ఇప్పటికే సంకేతాలు పంపింది. ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎమ్మెల్యేల బలం ప్రకారం కూటమికే దక్కనున్నాయి. వీటిలో టీడీపీ నాలుగు తీసుకుని, జనసేనకు ఒకటి కేటాయించే అవకాశం ఉంది.

నాడు పలువురి త్యాగం?

ఎన్నికల సమయంలో పిఠాపురం సీటును పవన్‌కల్యాణ్ కోసం మాజీ ఎమ్మెల్యే వర్మ త్యాగం చేశారు. బత్తుల బలరామకృష్ణ కోసం రాజానగరం సీటును బొడ్డు వెంకటరమణ చౌదరి, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న వాసంశెట్టి సుభాష్ కోసం రామచంద్రపురం సీటును రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న కందుల దుర్గేష్ కోసం నిడదవోలు సీటు బూరుగుపల్లి శేషారావు త్యాగం చేశారు. వీరిలో రాజానగరం సీటు త్యాగం చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరిని రుడా చైర్మన్‌గా నియమించింది. అంతేకాకుండా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు కేబినెట్ ర్యాంకు కట్టబెట్టింది. రెడ్డి సుబ్రహ్మణ్యంకు పార్టీ పొలిట్ బ్యూరో హోదా ఇచ్చింది. ఇక వీరిలో మిగిలింది వర్మ, శేషారావు మాత్రమే. నాడు టిక్కెట్లు కోసం గట్టిగా ప్రయత్నించిన మరికొందరికి వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులు కట్టబెట్టింది.

ముందు వరుసలో వర్మ..

మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారికి ఎమ్మెల్సీ పదవుల్లో తొలి ప్రాధాన్యత ఉంటుందని టీడీపీ అధిష్టానం గతంలో ప్రకటించింది. యనమల స్థానంలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని చంద్రబాబు ఎవరి ద్వారా భర్తీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. రేసులో పిఠాపురం వర్మ ముందువరుసలో ఉన్నట్టు సమాచారం. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా పిఠాపురం సీటును వర్మ త్యాగం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచి పోటీ చేయడంతో వర్మకు సీటు లేకుండా పోయింది. ఈనేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు అమరావతికి వర్మను పిలిపించి అధికారంలోకి రాగానే తొలి ఎమ్మెల్సీ పోస్టు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ పదవితో పాటు క్షత్రియుల కోటాలో మరింత గౌరవం కల్పిస్తానని పేర్కొన్నారు. అటు ఎన్నికల ప్రచారంలో పవన్ సైతం వర్మ లాంటి నేత చట్టసభల్లో ఉండాలని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు వర్మకు ఎమ్మెల్సీ పదవి కట్టబెడతారనే ప్రచారం జరుగుతోంది. వర్మ సైతం తనకు ఈ దఫా పదవి వస్తుందని ఆశాభావంతో ఉన్నారు.

నాగబాబుకు ఇస్తే..

జనసేన నుంచి నాగబాబును ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తారనే చర్చ జరిగింది. దీనికి సంబంధించి కొంతకాలం కిందట కూటమి తరపున అధికారిక ప్రకటన వచ్చింది. నాగబాబుకు ఎమ్మెల్సీ ఇస్తే వర్మకు ఛాన్స్ ఉండదనే ప్రచారం కొంతకాలం కిందట జరిగింది. ఖాళీ అయిన ఐదు స్థానాల్లో ఒకటి జనసేనకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఆ కోటాలో నాగబాబు ను భర్తీ చేస్తారనే చర్చ జరుగుతోంది. టీడీపీ ఖాతాలో ఉండే నాలుగింటిలో ఒకటి ఉమ్మడి జిల్లా కోటాలో వర్మకు ఇస్తారని, తద్వారా ఏ సమస్యా ఉండదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

మా సంగతేంటి?

గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం ఆర్థికంగా, కేడర్ పరంగా వెన్నుదన్నుగా ఉన్నామని, ఎమ్మెల్సీ పదవితో తమను గౌరవించాలని కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొందరు టీడీపీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఐదేళ్లలో పార్టీకి ఆర్థికంగాను, కేడర్‌పరంగాను చేసిన సేవలను వివరిస్తూ త్రుటిలో సీటు కోల్పోయిన విషయాన్ని గుర్తుచేస్తూ పదవికి పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా పార్టీ ఆశావహుల నియోజకవర్గాల్లో రహస్యంగా ఐవీఆర్ఎస్ సర్వే చేసినట్టు సమాచారం. ఆ సర్వే ప్రకారం పార్టీ ఇప్పటికే ఒక అంచనాకు వచ్చి ఉంటుందని అంటున్నారు. కోనసీమ జిల్లా నుంచి ఓ మహిళా నేత తనకున్న పలుకుబడితో ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అటు కమ్మ సామాజికవర్గం నుంచి సైతం కొందరు నేతలు పావులు కదుపుతున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది త్వరలో తేలనుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి మార్చి 10న నామినేషన్ దాఖలు చేయడానికి ఆఖరిరోజు కావడంతో వచ్చే నెల మొదటివారంలోనే పదవుల కేటాయింపుపై స్పష్టత రానుంది.

అంతా పక్కాగా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం..
- కోనసీమ జిల్లాలో 95 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న పట్టభద్రులు 64,471 మంది
- బ్యాలెట్ పేపర్లను తనిఖీచేసిన జేసీ నిషాంతి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):



జేసీ నిషాంతికి ఎన్నికల ఏర్పాట్లు వివరిస్తున్న అధికారులు

ఈ నెల 27వ తేదీ జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించి శిక్షణ కార్యక్రమాలు కూడా ముగించారు. మరో రెండు రోజుల్లో జరగనున్న ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో డిస్ట్రిక్ట్ రెవెన్యూ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అయిన బీఎల్ఎన్ రాజకుమారి ఆధ్వర్యంలో ఎన్నికల ఏర్పాట్లను పూర్తి చేశారు. కోనసీమ జిల్లా పరిధిలోని 3 రెవెన్యూ డివిజన్లు అయిన అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట పరిధిలో ఉన్న 22 మండలాల్లో 95 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులైన ఓటర్లు 64,471 మంది ఉన్నారు. వారిలో పురుషులు 37,114 మంది, మహిళలు 27,355 మంది, ట్రాన్స్ జెండర్లు ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందు కోసం అమలాపురం డివిజన్ పరిధిలో 45, రామచంద్రపురం డివిజన్ పరిధిలో 23, కొత్తపేట డివిజన్ పరిధిలో 27 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా పోలింగ్ స్టేషన్లు..

ఆలమూరు మండలంలో 3, మండపేట 8, కపిలేశ్వరపురం 3, రాయవరం 2, రామచంద్రపురం 7, కె.గంగవరం 3, ఆత్రేయపురం 3, రావులపాలెం 5, ఐ.పోలవరం మండలం 4, ముమ్మిడివరం 5, అయినవిల్లి 3, కొత్తపేట 6, పి.గన్నవరం 4, అంబాజీపేట 3, అమలాపురం 10, మామిడికుదురు 4, రాజోలు 5, మలికిపురం 4, సఖినేటిపల్లి 4, అల్లవరం 3, ఉప్పలగుప్తం 3, కాట్రేనికోన మండలంలో 3, మొత్తం 95 పోలింగ్ కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు కోసం 22 బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ 22, స్టాటస్టిక్ సర్వేలెన్స్ టీమ్స్ 10, స్పెషల్ వీడియో టీమ్స్ 22 బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అమలాపురం డివిజన్‌లో 45 పోలింగ్ కేంద్రాలకు గాను 54 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ (ఏపీవో) 54 మంది, పోలింగ్ ఆఫీసర్లు 108 మంది, మైక్రోవేవ్ అబ్జర్వర్లు 54 మంది వెరసి 270 మందిని నియమించారు. అదే విధంగా రామచంద్రపురం డివిజన్‌లో 23 పోలింగ్ కేంద్రాలకు గాను 28 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ (ఏపీవో) 28 మంది, పోలింగ్ ఆఫీసర్లు 56 మంది, మైక్రోవేవ్ అబ్జర్వర్లు 28 మంది మొత్తం 140 మందిని నియమించారు. కొత్తపేట డివిజన్‌లో 27 పోలింగ్ కేంద్రాలకు గాను 32 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ (ఏపీవో) 32 మంది, పోలింగ్ ఆఫీసర్లు 56 మంది, మైక్రోవేవ్ అబ్జర్వర్లు 32 మంది మొత్తం 140 మందిని నియమించారు. వీరందరికీ అమలాపురం కలెక్టరేట్ భవన్‌లో ఈ నెల 17, 24 తేదీల్లో ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు..

పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అమలాపురం డివిజన్‌కు సంబంధించి వెత్సావారి అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల భవనంలో ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించి వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల కొత్తపేట డివిజన్‌కు సంబంధించి ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటుచేశారు. ఎన్నికల అనంతరం రిసెప్షన్ కేంద్రాలుగా కూడా ఇవే కొనసాగుతాయి. అక్కడే స్ట్రాంగ్ రూములు కూడా ఏర్పాటు చేశారు. అదే విధంగా జిల్లాస్థాయిలో జోన్స్, సెక్టోరియల్ ఆఫీసర్స్, రూట్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 202 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉండగా వాటిలో 187 బ్యాలెట్ బాక్సులు మంచి కండిషన్‌లో ఉన్నాయి.



బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

బ్యాలెట్ పేపర్లను పరిశీలించిన జేసీ

ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఉభయ గోదావరి జిల్లాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి బ్యాలెట్ పేపర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సోమవారం కలెక్టరేట్‌లో పరిశీలించారు. బ్యాలెట్ సీరియల్ నంబర్లు పరిశీలించాలని, అదేవిధంగా ప్రింటింగ్ తప్పుడు, పేపరు బాగా నలిగిపోయినవి ఉంటే వాటిని తొలగించడం వంటి అంశాలపై సిబ్బందితో ఆమె చర్చించారు. డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పరిపాలనాధికారి కాశీవిశ్వేశ్వరరావు, తహశీల్దార్లు అశోక్, ఐపీ శెట్టి, ప్రసాద్, సుబ్రహ్మణ్యాచారి, డీటీలు వంశీ, శివరాజ్, చినబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'ద్రాక్షారామ'లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



క్యూలైన్ల ఏర్పాటు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు ద్రాక్షారామ భీమేశ్వరాలయం సిద్ధమైంది. భీమేశ్వరాలయంలో మహా శివరాత్రి పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, ప్రాత:కాలార్చన, తీర్థపుబిందె, ప్రథమ అభిషేకం, బాలబోగం కార్యక్రమాలు జరుగుతాయి. 4.00 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భీమేశ్వరస్వామి వారికి భక్తులచే అభిషేకాలు, ఏకాదశ రుద్ర హోమం. పూజలు జరుగుతాయి. రాత్రి 8.00 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ జరుగుతుంది. 11 నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శనానికి విరామం. లింగోద్భవకాలంలో మహానివేదన సమర్పిస్తారు. 12 గంటల నుంచి రాత్రి 1.30 వరకు స్వామి దర్శనానికి అనుమతిస్తారు. ఆలయానికి తరలివచ్చే భక్తులకు స్వామి దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత, శీఘ్ర, విశిష్ట దర్శనానికి వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ అధికారి, ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు, ఈవో అల్లువెంకట దుర్గాభవానీ తెలిపారు. భక్తులకు సేవలు అందించేందుకు పరిసర ఆలయాల సిబ్బందిని నియమించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పిల్లలకు పాలు అందచేసేందుకు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరుగుతుంది. పైండావారి అన్నసత్రంలో అన్నదానం జరిపేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

సినీ గాయని మంగ్లీ భక్తి సంగీత విభావరి

మహాశివరాత్రి ఉత్సవాలకు ఈ ఏడాది సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ గాయకులచే భక్తి సినీ సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు చైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. ద్రాక్షారామ వీవీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు శివరాత్రి జాగరణలో మంగ్లీ ఆధ్వర్యంలో భక్తి సంగీతవిభావరి, భక్తి కార్యక్రమాలు ప్రదర్శన జరుగుతాయన్నారు. సినీ గాయకులు మాళవిక, కృష్ణ చైతన్య, సాయిశిల్ప, వైష్ణవి, మృదులతో భక్తిగీతాలు ఆలపిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్ హాజరవుతారని వివరించారు.

కోటిపల్లిలో పకడ్బందీగా..



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కె.గంగవరం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకూ జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. సోమేశ్వరస్వామి ఆలయం లోపల, వెలుపల క్యూలైన్లు ఏర్పాట్లు, భక్తులకు ఎండ తీవ్రత నుంచి రక్షించడానికి టెంట్లు వేశారు. పుష్కరాల రేవులో మెట్లపై ఉన్న ఇసుకను ఫైర్ సిబ్బంది తమ వాటర్ గన్‌లతో శుభ్రం చేశారు. పుణ్యస్నానాలు ఆచరించే మహిళా భక్తులు దుస్తులు మార్చు కునేందుకు తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేశారు. గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు గోదావరి నదిలో లోతులోకి వెళ్లకుండా కర్రలతో రక్షణ వలయం, వాహనదారులు వాహనాలను భద్రపరుచు కునేలా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ కోటిపల్లి రేవు వద్ద ఉన్న పార్కింగ్ ప్రదేశాన్ని, పుష్కరాల రేవును పరిశీలించారు. సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐ ఎస్‌కే జానీ బాషాకు పలు సూచనలు చేశారు.


హర్యానా వర్సెస్ ఉత్తరాఖండ్ సెక్రటేరియట్


గోల్ కొడుతున్న ఆంధ్ర జట్టు కెప్టెన్


ఆంధ్ర సెక్రటేరియట్ వర్సెస్ మహారాష్ట్ర సెక్రటేరియట్

హాకీ చలాకీ





కాకినాడలో పదో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు
పురుషులు, మహిళల విభాగాల్లో సత్తా చాటుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటులో సోమవారం వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 8 మ్యాచ్‌లు జరిగాయి. డీఎస్డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పోటీలను పర్యవేక్షించారు. పురుషుల విభాగంలో... ఆర్ఎస్సీ రాయపూర్, ఆర్ఎస్సీ జైపూర్ మధ్య మ్యాచ్‌లో ఆర్ఎస్సీ రాయపూర్ జట్టు 3-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 6-1 తేడాతో గెలుపొందింది. ఉత్తరాఖండ్ సెక్రటేరియట్, కర్ణాటక సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌ను 3-1 తేడాతో ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ కైవసం చేసుకుంది. హిమాచల్‌ప్రదేశ్ సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ 4-2 తేడాతో విజయం సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు 3-1 తేడాతో విజయం సాధించింది. మహిళల విభాగంలో... ఒడిశా సెక్రటేరియట్, తెలంగాణ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జరిగిన మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ జట్టు 3-0 తేడాతో గెలిచింది. బిహార్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బిహార్ సెక్రటేరియట్ 7-2 తేడాతో విజయం సాధించింది.


కేరళ సెక్రటేరియట్ వర్సెస్ హర్యానా సెక్రటేరియట్


మ్యాచ్‌ను వీక్షిస్తున్న దృశ్యం

సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి



ఎ.శ్రీనివాస్, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ, కల్చరల్ ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జి

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలతో అలసిపోయిన క్రీడాకారులకు వినోదంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రోగ్రామ్స్‌ను డిజైన్ చేశారు. వీటికి క్రీడాకారులతో పాటు స్థానికుల నుంచి మంచి స్పందన వస్తోంది. జాతీయ స్థాయి టోర్నీని మన కాకినాడలో నిర్వహించుకోవడం గర్వకారణంగా ఉంది. అందుకు తగ్గట్టుగానే ప్రోగ్రామ్స్ కూడా ఏర్పాటు చేశాం. కలెక్టర్ షాన్ మోహన్ ఆర్డీవోలను, హెచ్‌వోడీలను టోర్నమెంటులో ఇన్వాల్వ్ చేస్తూ టోర్నీని సక్సెస్ ఫుల్‌గా జరిపిస్తున్నారు.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి

క్రీడాకారుల అలవాట్లకు తగ్గట్టుగానే ఆతిథ్యం



కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, సెట్రాజ్ సీఈవో

సివిల్ సర్వీసెస్ హాకీ నేషనల్ టోర్నమెంటుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను దృష్టిలో పెట్టుకున్నాము. నార్త్, సౌత్ క్రీడాకారుల ఆహారపు అలవాట్లకు తగ్గట్టుగా ఆతిథ్యం ఇస్తున్నాం. సాయంత్రం వేళ సాంస్కృతిక ప్రదర్శనలతో క్రీడాకారులు సేదతీరుతున్నారు. కలెక్టర్, జేసీలు ప్రోగ్రామ్‌ల కన్వీనర్లు, సభ్యులతో నిరంతరం మాట్లాడుతూ సమన్వయపరచడంతో టోర్నమెంటును సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించగలుగుతున్నాం.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి


ఇంజనీరింగ్ విద్యార్థి శ్రీధర్ స్మారక వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

అమ్మ మనసును బాధ పెట్టకండి

నన్నయ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ


ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్ల జోలికి పోవద్దని, రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణం చేయండని తాను వీసీగా కాకుండా అమ్మలా చెప్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. పిల్లలకు జరగరానిది జరిగితే తల్లి మనసు విలవిలలాడిపోతుందని, అమ్మ మనసును బాధ పెట్టవద్దని కోరారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ ఈసీఈ విద్యార్థి ఎస్.శ్రీకాంత్ గత ఏడాది మృతి చెందాడు. అతడి పేరిట శ్రీకాంత్ స్మారక వాలీబాల్ టోర్నమెంటును సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ... తాను పెద్ద కుమారుడు తేజ్‌నయన్‌ను 1989లో, చిన్న కుమారుడు సిద్ధార్థ్‌ను 2010లో పోగొట్టుకున్నానన్నారు. ఇద్దరు పిల్లలనూ దూరం చేసిన దేవుడు తనకు ఇప్పుడు ఇంతమంది పిల్లలను ఇచ్చాడన్నారు. ఒక బిడ్డను పోగొట్టుకుంటే అమ్మ మనసు ఎంత బాధపడుతుందో తనకు తెలుసన్నారు. మీరంతా బాగా చదువుకుని తల్లిదండ్రులకు అండగా నిలవాలని కోరారు. తాను వీసీగా కాకుండా మీ అందరికీ అమ్మలా వచ్చానని చెప్పారు. ఏ పని చేసినా కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, అప్పుడే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బి.సుధాకిరణ్, బి.కృష్ణ, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.34 కోట్లు

బంగారం 30 గ్రాములు, వెండి కిలో, 34 విదేశీ కరెన్సీ లభ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు ఎస్వీఎస్వీ ప్రసాదరాజు, టీవీఎస్ఆర్ ప్రసాద్ పర్యవేక్షణలో సోమవారం తెరిచి లెక్కించారు. 31 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,09,68,428, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.21,50,593... మొత్తం రూ.1,34,01,911 ఆదాయం లభించింది. బంగారం 30 గ్రాములు, వెండి కిలో, 34 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,82,890 లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో అర్చకస్వాములు, గ్రామస్థులు, శ్రీవారి సేవకులు, కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.




కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కనుల పండువగా కుక్కుటేశుని కల్యాణం

పిఠాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకారం చేసి పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదికపై ఆసీనులు గావించారు. ఆస్థాన వేద పండితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠీ, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆచార్య బ్రహ్మత్వంలో, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచిన అనంతరం మాంగల్యధారణ జరిగింది. అర్చకులు పోటీపడుతూ స్వామి, అమ్మవార్లపై తలంబ్రాలు వేశారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ దంపతులు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. కల్యాణానికి ముందు వాసవి మహిళా భక్త బృందం సభ్యుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా భీమేశ్వరుని కల్యాణం

సామర్లకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమార రామ భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్ల దివ్య కల్యాణం సోమవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పట్టణ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి ఆలయానికి తీసుకొచ్చారు. కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో రాత్రి పదకొండు గంటలకు కల్యాణ తంతును ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాల శర్మ, సన్నిధిరాజు వెంకన్నబాబు, కొంతేటి భీమేశ్వర శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి సుబ్బారావు దంపతులు స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలను సమర్పించారు. కల్యాణ ప్రక్రియను తణుకుకు చెందిన పండితుడు శర్మ చక్కగా వివరించారు. గంజి బూరిబాబు కుటుంబ సభ్యులు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, భక్తులు


భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు


భారీ క్రేన్‌తో చెట్టును నాటుతున్న దృశ్యం

90 ఏళ్ల రావిచెట్టుకు పునరుజ్జీవం

90 ఏళ్ల వయసు కలిగిన రావిచెట్టును రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో పునరుజ్జీవింపజేశారు. ఈ చెట్టును వాహనంపై తీసుకొచ్చి భారీ క్రేన్ సహాయంతో జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో పెద్ద గొయ్యి తీసి సోమవారం నాటారు. రాజమహేంద్రవరంలోని కోర్టుల సముదాయంలో భవనాల నిర్మాణంలో భాగంగా తొలగించిన ఈ రావిచెట్టును రోటరీ ఐకాన్స్ ప్రతినిధులు గుర్తించి ఇక్కడకు తెచ్చారు. తొలుత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ (అడ్మిన్), ఎల్.అర్జున్ (క్రైమ్స్), చెంచిరెడ్డి (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



విస్తృతంగా చికెన్ మేళాలు

- బర్డ్‌ఫ్లూ లేదన్న అధికారుల సూచనలతో వెంకోబ్, హేచరీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- పిఠాపురంలో చికెన్ పకోడీ, గుడ్లు పంపిణీ
- కొత్తపల్లి, తునిల్లో చికెన్‌తో భోజనాలు



కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో చికెన్‌మేళా క్యూలో పాల్గొన్న ప్రజలు

పిఠాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సోమవారం సాయంత్రం చికెన్ అండ్ ఎగ్‌మేళా నిర్వహించారు. వెంకోబ్ చికెన్ ఆధ్వర్యంలో ఉచితంగా చికెన్ పకోడీ, ఉడకపెట్టిన గుడ్లు పంపిణీ చేశారు. వీటి కోసం ప్రజలు భారీగా తరలివచ్చారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చికెన్, గుడ్లపై ప్రజల్లో నెలకొన్న అపోహను తొలగించేందుకు ఈ మేళా నిర్వహించారు. ఉడకపెట్టి వండిన చికెన్, గుడ్లు వల్ల ఏ విధమైన ఇబ్బంది ఉండదని ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ మేళా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో..

కొత్తపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉప్పాడకు చెందిన చికెన్ వ్యాపారస్తులు సోమవారం బీచ్‌రోడ్డు సెంటర్‌లో చికెన్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 200 కిలోల చికెన్ తయారుచేశారు. 2వేల గుడ్లను ఉడకపెట్టారు. చికెన్, ఎగ్‌లను భుజించేందుకు తీర ప్రాంతాలకు చెందిన ప్రజలతోపాటు ఉప్పాడనుంచి బీచ్‌రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లే ప్రయాణికులు క్యూకట్టారు. ఈ సందర్భంగా వెమ్‌కోబ్ చికెన్ ఉత్పత్తిదారులు మాట్లాడుతూ చికెన్‌లో బర్డ్‌ఫ్లూ వైరస్ లేదని జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకే పలుచోట్ల చికెన్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు.

తుని పట్టణంలో..

తుని రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తునిలో రెండుచోట్ల చికెన్, కోడిగుడ్లతో ఉచితంగా విందు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎగబడ్డారు. తుని పట్టణంలో సీఎంఆర్ సెంటర్‌తోపాటు అన్న క్యాంటీన్ పక్కన చికెన్‌తో ఉచిత భోజనాల శిబిరంవద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా వెంకటేశ్వర హేచరీస్ నిర్వాహకులు మాట్లాడుతూ చికెన్, గుడ్లు కొనుగోలులో ప్రజల్లో అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తలపెడుతున్నామని తెలిపారు.



పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో చికెన్‌మేళాకు తరలివచ్చిన ప్రజలు

కోడిగుడ్డు ధర.. కిందకు..

- బర్డ్‌ఫ్లూ ప్రభావంతో తగ్గిన గుడ్డు రేటు
- రూ.6.60 పైసల నుంచి రూ.4కి చేరిన ధర



గండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర కిందకు పడిపోయింది. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఎక్కడికక్కడ కోడిగుడ్డు వాడకం తగ్గింది. దీంతో గుడ్డు ధర అమాంతంగా తగ్గిపోయింది. నెలరోజుల కిందట వరకు గుడ్డు రేటు రూ.6నుంచి రూ.6.50వరకు పలికేది. ప్రస్తుతం రూ.4 పలుకుతోంది. కోళ్ల ఫారాల్లో కూడా గుడ్లు ఎగుమతులు ఆగిపోయాయి. దీంతో ఫారం నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు లాభాలు చూసిన వాళ్లంతా నష్టాలు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు నష్టాలు ఎక్కువై ఫారం ఉంచాలా తీసేయాలా అన్నస్థితిలో ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 20లక్షల కోళ్లు ఉండగా ఉమ్మడి జిల్లాలో కోటి20 లక్షలు ఉన్నాయి. వాటి మీదే నిర్వాహకులు బతుకు జీవనం సాగిస్తున్నారు. ఈ వైరస్ వల్ల గుడ్లు రేటు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు ఒక్క గుడ్డు తయారు కావడానికి రూ.5 వరకు ఖర్చవుతుందని, కానీ రేటు మాత్రం రూ.4 పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు



ఎస్పీ దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థానం పీఆర్వో

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

అన్నవరం దేవస్థానం టెండర్ ప్రకటనలో కాలపరిమితిగా భావించాలి: ఈవో

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో సోమవారం ఇచ్చిన టెండర్ ప్రకటనలోని వివరాల్లో మొదటి వరుసలో ఉన్న షెడ్యూల్ ఖరీదు స్థానంలో కాలపరిమితి అని భావించాలని దేవస్థానంఈవో వీర్ల సుబ్బారావు కోరారు. ఆసక్తి కలిగి టెండర్ కం ఈ ప్రొక్యూర్‌మెంట్‌లో పాల్గొనేగుత్తేదారులు ఈవిషయాన్ని గమనించాలన్నారు.

'అన్నవరం'లో సమూల మార్పులు

- అన్నవరంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటన
- భక్తులనుంచి అభిప్రాయాల సేకరణ
- అన్నదానంలో భక్తులు వేచి ఉండకుండా సిట్టింగ్‌తోపాటు బఫే విధానం
- గదుల కేటాయింపునకు ఇకపై నగదు రహిత విధానం అమలు
- ఈవో, చైర్మన్, సిబ్బందితో సమీక్ష
- ఇకపై ప్రతినెలా సమీక్ష



భక్తుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటున్న కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో భక్తులకు సంతృప్తికరమైన సేవలందుతున్నాయా లేదా అనేదానిపై ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం చివరి స్థానం రావడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ సోమవారం స్వయంగా రంగంలోకి దిగి భక్తుల అభిప్రాయాలు తీసుకున్నారు. ముందుగా సత్యదేవుడిని దర్శించుకున్న ఆయన క్యూలైన్ ద్వారా దర్శనానికి విచ్చేసిన భక్తుల ఇబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారినుంచి సంతృప్తికరమైన జవాబు రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి

పశ్చిమ రాజగోపురంవద్ద మహిళా భక్తురాలు సత్రం గదులు తీసుకునే సమయంలో కేవలం నగదు లావాదేవీలు మాత్రమే జరుపుతున్నారని, డిజిటల్ పేమెంట్‌లు లేవని తెలపడంతో సత్వరమే నగదు రహిత సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు గంట సమయం క్యూలైన్‌లో వేచిఉన్నామని కలెక్టర్‌కు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఒక హాలులో కేవలం 425మంది కూర్చుని తినేందుకు మాత్రమే అవకాశం ఉందని తెలపడంతో పై అంతస్తులో బఫే విధానం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణకు సంబంధించి వృథాగా పడిఉన్న సామాన్లను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేదన్నారు. నిరుపయోగ సామానంతా ఒకచోట స్టోర్స్‌కు చేర్చుకోవాలని, మరుగుదొడ్ల నిర్వహణ తదితర ఫొటోలు తనకు ప్రతిరోజూ సాయంత్రం వాట్సాప్‌లో పంపించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. ఆదివారం రాత్రి 9గంటలకు విచ్చేసిన భక్తురాలికి గదులు ఖాళీ లేవని చెప్పడంతో సీఆర్వో కార్యాలయంలో ఆదివారం రాత్రికి జరిగిన గదుల బుకింగ్‌ను పరిశీలించారు.

'అభివృద్ధి కంటికి కనిపించాలి..'

అనంతరం ఈవో ఈర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, అన్నివిభాగాల సూపరింటెండెంట్లు, ఇంజనీరింగ్ అధికారులు, ఏఈవోలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పలుచోట్ల నేమ్‌బోర్డులు పూర్తిస్థాయిలో కనిపించలేదని ప్రధానంగా జల ప్రసాదం కేంద్రాలవద్ద అక్షరాలు క్లారిటీగా లేవని ప్రతిచోట పరిశీలించి సరిచేయాలని ఈవోకు సూచించారు. ప్రసాదం విక్రయ కేంద్రాల్లో సిబ్బంది గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలని ఆదేశించారు. తల్లులు పిల్లలకు పాలిచ్చే కేంద్రం ఎప్పుడూ తెరిచి ఉంచడంతోపాటు మహిళా ఉద్యోగిని అక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకపై ప్రతినెలా ఒకసారి రివ్యూ చేస్తామని మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధి కంటికి కనిపించాలని కాగితాలకు పరిమితం కాకూడదన్నారు. వచ్చేనెల రివ్యూలో దేవస్థానం భూములు, స్థలాల ఆక్రమణలపై చర్చిస్తానన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం చివరిస్థానం రావడం బాధనిపించిందన్నారు. సిబ్బంది భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సత్రంగదుల ఖాళీల వివరాలు చెప్పడంలో కౌంటర్ సిబ్బందినుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

అత్యాచారం కేసులో నేరస్తుడికి పదేళ్ల జైలు

శిక్షతోపాటు రూ.5వేల జరిమానా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడిపై అభియోగాలు రుజువు కావడంతో కోర్టు జైలుశిక్ష విధించింది. రాజమహేంద్రవరంలోని ప్రకాశంనగర్ సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన వాసంశెట్టి దేవికుమార్ లాలా చెరువుకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించాడు. పలుమార్లు శారీరక వాంఛ తీర్చుకున్నాడు. వివాహం చేసుకోవాలని ఆమె కోరగా తిరస్కరించాడు. దీనిపై ఆమె ఫిర్యాదుతో 2023, మే 20న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి, మహిళలపై నేరాల విచారణ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి వై.వెన్నయ్య నాయుడు సోమవారం తీర్పు చెప్పారని సీఐ తెలిపారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు, సీఐలు బాజీలాల్, పీఈ పవన్ కుమార్ రెడ్డి, పీసీ రమేశ్‌ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చెట్టుకు ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఉరేసుకుని మృతి చెందిన వ్యక్తి

గండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిలో పోలవరంగట్టున గుర్తు తెలియని వ్యక్తి సోమవారం చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 35-40ఏళ్ల వయస్సులో పు ఉండి నీలం, పసుపు, నలుపు రంగుల పొడుగు చేతుల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంట్ కలిగి ఉన్నాడన్నారు. ఆ చెట్టుపక్కనే సైకిల్ పడిఉందన్నారు. స్థానిక వీఆర్ఏ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిస్తే జగ్గంపేట సీఐ శ్రీనివాస్ 9440796529, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు 9440904841 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలునుంచి జారిపడి..

సామర్లకోట,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో వేట్లపాలెం-జి.మేడపాడు రైల్వేట్రాక్‌పై సోమవారం 35ఏళ్ల వయస్సుగల పురుష మృతదేహాన్ని రైల్వేపోలీసులు కనుగొన్నారు. రైల్వే కీమెన్ అందించిన సమాచారంతో వారు సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. గుర్తుతెలియని రైలు ఢీకొనడం లేదా రైలునుంచి జారిపడడం జరిగి ఉంటుందనిపోలీసులు భావిస్తున్నారు. మృతదేహం కుడిచేతి ఎల్బోపై ఈశ్వరి అని తెలుగులో రాసిఉందని, కుటుంబసభ్యులు ఉంటే తమను సంప్రదించాలని కేసు దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తూ ఆటోనుంచి జారి పడి..
నాలుగేళ్ల బాలుడి మృతి

- కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఘటన
- పెళ్లింట విషాదం



పవన్‌శ్రీనివాస్(పాత చిత్రం)

పి.గన్నవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బాబాయ్ పెళ్లికి వచ్చిన ఆ బాలుడిని ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఆ బాలుడు మృతి.. పెళ్లింట విషాదం మిగిల్చింది. కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టుపై ప్రమాదవశాత్తూ ఆటోనుంచి పడిపోయి నాలుగేళ్ల బాలుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి శివనాగేంద్ర కుటుంబం కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు.ఈక్రమంలో వచ్చేనెల 1న తమ్ముడు వివాహం కావడంతో ముందుగా భార్య, పిల్లలు సొంత గ్రామానికి వచ్చారు. సోమవారం ఆదిమూలంవారిపాలెంనుంచి శివనాగేంద్ర కుమారుడు పవన్ శ్రీనివాస్(4) తన బాబాయ్(వరసకు) సాయంతో లోడు ఆటోలో రాజోలుమండలం శివకోడు బంధువులు ఇంటికి వెళ్లాడు. శివకోడునుంచి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో పి.గన్నవరం అక్విడెక్టు వద్దకు వచ్చేసరికి ఆటో డోర్ ఊడిపోవడంతో ముందు కూర్చున్న చిన్నారి రోడ్డుపై పడిపోయాడు. దీంతో పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా బలమైన గాయం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచనతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పవన్‌శ్రీనివాస్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతడికి తండ్రి శివనాగేంద్ర, తల్లి స్వర్ణ, సోదరుడు రోహిత్ ఉన్నారు. బాలుడి మృతితో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. తమ కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని ఆ కుటుంబం రోధిస్తున్న తీరు కంటనీరు పెట్టిస్తోంది.

పాఠశాల భవనం పైనుంచి దూకేసిన విద్యార్థిని

- తండ్రి మందలించడమే కారణమంటున్న సహచర విద్యార్థినులు
- మండపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఘటన
- చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలింపు

మండపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడన్న కోపంతో మండపేట ప్రభుత్వ బాలికల హైస్కుల్‌లో ఆరో తరగతి విద్యార్థిని పాఠశాల భవనంపైనుంచి కిందకు దూకేసిన సంఘటన ఇది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఇంటర్వెల్ సమయంలో దూకేసి..

మండపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు దగ్గర్లోని ప్రభుత్వ బాలికల హైస్కుల్లో మహ్మద్‌పౌజీ (14) ఆరో తరగతి చదవుతోంది. సోమవారం ఆమెను తండ్రి ఇంటి నుంచి పాఠశాలకు తీసుకువచ్చి బయట మందలించి కొట్టి లోపల అప్పగించాడు. తండ్రి కొట్టి.. తిట్టడంతో మనస్తాపానికి గురైన ఆమె తరగతిగదిలో సహచర విద్యార్థినులతో జరిగిన సంఘటన చెప్పి బాధపడింది. తన తండ్రి తనను మందలించాడని తాను పాఠశాల భవనంపైనుంచి దూకేస్తానని చెప్పింది. ఈ విషయం బయటకు రాకముందే ఆమె పాఠశాల ఇంటర్వెల్ సమయంలో బయటకు వచ్చి పాఠశాల మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేసింది. ఆమెను తక్షణమే వైద్యచికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు మెరుగైన వైద్యంకోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూచించారు. వెంటనే 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడ విద్యార్థిని కోలుకుంటోందని సమాచారం అందిందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణ తెలిపారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులకు ఏమైనా ఫిర్యాదు వచ్చిందా అని ప్రశ్నించగా తమ దృష్టికి ఆస్పత్రినుంచి సమాచారం వచ్చిందని వారు బదులిచ్చారు.

వృద్ధురాలిపై దాడి కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిపై దాడికి పాల్పడడమే కాకుండా ఆమె నగలు, నగదు తస్కరించిన కేసులో కాకినాడ పోలీసులు సోమవారం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.

ఇంట్లో ఒంటరిగా ఉండగా..

కాకినాడ జగన్నాథపురం యానాం రోడ్డులోని ఒంటరిగా నివసిస్తున్న తనను ఈనెల 14న రాత్రి 9 గంటల సమయంలో నలుగురు అగంతకులు దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించి తన కాళ్లు, చేతులు కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి, ఇష్టానుసారంగా తనను శారీరకంగా హింసించి ట్రంకు పెట్టెలో ఉన్న బంగారపు ఉంగరం, బంగారపు గాజు, రూ.60వేల నగదును అపహరించుకుపోయినట్లు బాధితురాలు 74ఏళ్ల చాగంటి శుక్రవారపు మహాలక్ష్మి కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశానుసారం, కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, వన్‌టౌన్ లాఅండ్‌ఆర్డర్ సీఐ ఎం.నాగదుర్గారావు బృందం ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో దర్యాప్తు చేపట్టారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన చాగంటి రజిత అలియాస్ దారా రజిత అలియాస్ సిరి అదే ప్రాంతానికి చెందిన దారా రఘు, కరీంనగర్‌కు చెందిన తోందిర్తి లత అలియాస్ హేమలత, అదే ప్రాంతానికి చెందిన తాటి వెంకటేష్‌లను అరెస్ట్ చేసి 6.50 గ్రాముల గంగారపు గాజు, 2.70 గ్రాముల బంగారపు ఉంగరం, రూ.30వేల నగదును పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. నలుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం, నిందితులకు సహకారం అందించిన ఫిర్యాది మహాలక్ష్మి ఇంట్లోని పనిమనిషి కాకినాడ జగన్నాథపురానికి చెందిన రామలక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేశారు.

వరుసకు కోడలే ప్రధాన నిందితురాలు

శుక్రవారపు మహాలక్ష్మి, శ్రీరామచంద్రమూర్తి దంపతులకు సంతానం లేకపోవడంతో శంకర్ అనే బాలుడిని దత్తత తీసుకుని పెంచుకున్నట్లు ఎస్‌డీపీవో తెలిపారు. అతడు పెద్దయ్యాక ఉద్యోగ రీత్యా తెలంగాణకు వెళ్లి అక్కడ రజితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మహాలక్ష్మి ఒంటరిగా ఉండడంతో ఆమెలో దుర్బుద్ధి పుట్టింది. పనిమనిషితోపాటు తన కుటుంబసభ్యుల సహకారంతో రజిత ఈనీచానికి ఒడిగట్టినట్లు ఎస్‌డీపీవో తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని చోరీసొత్తును స్వాధీనం చేసుకున్న సీఐలు కృష్ణ, నాగదుర్గారావ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు వినయప్రతాప్, పీసీ స్వామినాయుడులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ట్రాఫిక్ మళ్లింపు

- సామర్లకోటకు వెళ్లాల్సిన దారుల్లో వాహనాల రూట్ల మార్పు

సామర్లకోట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాల ట్రాఫిక్‌ను వేరే రూట్లలో మళ్లించేలా తాత్కాలిక మార్పులు చేపట్టినట్లు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకూ మార్పు చేసిన ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. రాజానగరం నుంచి కాకినాడ వెళ్లే భారీవాహనాలు కత్తిపూడి నుంచి అచ్చంపేట జంక్షన్ మార్గంలో కాకినాడ వెళ్లాల్సిఉంది. రాజానగరం, పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్లే లైట్ వెహికల్స్, ఆటోలు, ఆర్టీసీ బస్సులు మాత్రమే ఈ మార్గం వైపు పంపుతారు.

కాకినాడ-రాజానగరం మార్గంలో..

కాకినాడ నుంచి రాజానగరం మార్గం వైపు వెళ్లే భారీవాహనాలు కాకినాడ, అచ్చంపేట, కత్తిపూడి మీదుగా రాజానగరం వెళ్లాల్సి ఉంటుంది. కాకినాడనుంచి రాజానగరం వెళ్లే లైట్ వెహికల్స్, పాసింజర్ ఆటోలు, ఆర్టీసీ బస్సులు మాత్రమే సామర్లకోట,పెద్దాపురం వైపునుంచి పంపుతారు.

ద్వారపూడి-సామర్లకోట మార్గంలో..

ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలునుంచి సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్లాల్సిన భారీ వాహనాలు సామర్లకోట ఫ్లైఓవర్‌బ్రిడ్జి మీదుగా సామర్లకోట రైల్వేస్టేషన్, పిఠాపురం రోడ్డు నుంచి కాకినాడ మార్గం వైపు పంపుతారు.

పెద్దాపురం-కాకినాడ మార్గంలో..

పెద్దాపురం నుంచి కాకినాడ వెళ్లే భారీ వాహనాలు కూడా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం నుంచి బ్రౌన్‌పేట మీదుగా పిఠాపురం మీదుగా వెళ్లాల్సిఉంది. వాహనదారులు, ప్రయాణికులు పోలీసు అధికారులకు, సిబ్బందికి సహకరించాలని సీఐ కృష్ణభగవాన్ కోరారు. ఈ సందర్భంగా సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు కూడా పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్: పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలని, బాధితులకు తగు పరిహారం అందాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు వివిధ చిట్‌ఫండ్ సంస్థలు, ఏపీఈపీడీసీఎల్, బ్యాంక్‌ల ప్రతినిధులు, ఆయా సంస్థల న్యాయవాదులతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్న ఇద్దరు యువకులను కోరింగి ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం అరెస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లరేవులోని నందిరేవు సంతమార్కెట్‌కు చెందిన పోతాబత్తుల ఏసురాజు ఈనెల 18న ఓ వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో బంగారం చైన్, నల్లపూసల తాడును లాక్కుని అపహరించుకుపోయాడు. పోలీసులు నిందితుడిని పట్టుకుని 2.5కాసులు బంగారం రికవరీ చేశారు. కాకినాడ రూరల్‌కు చెందిన బొడ్డు అంజిబాబు కోరింగ యల్లమ్మగుడి వద్ద హుండీని దొంగిలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితులనుంచి వస్తువులను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా లలితా పారాయణం

అంతర్వేది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం, గుడిమూల గ్రామాల్లో వెలసి ఉన్న కృతకృత్య రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళా భక్తులతో లలితా పారాయణం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మూడు గంటల పాటు లలితా పారాయణంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్యాడ్లు, పెన్నల పంపిణీ

అల్లవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గోడి బాలుర గురుకుల కళాశాల, పాఠశాలలో షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం అల్లవరం మండల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులు, ఇతర ఉపకరణాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాసాగు విద్యుత్ సమస్యలపై వినతి

ఏఈకి వినతిపత్రం అందించిన రైతులు

అంతర్వేది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలంలోని ఆక్వా రైతులు సోమవారం విద్యుత్ ఏఈకి వినతిపత్రాన్ని అందించారు. ప్రధానంగా విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం సర్వీసులైను చార్జీలు వెంటనే చెల్లించమని సీఎండీ నుంచి ఉత్తర్వులు రావడంతో రైతులంతా ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు. అలాగే ధర్నా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆక్వా సాగు చేసుకునే రైతులంతా ఇటీవల రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు సర్వీసులైను చార్జీలు రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందించి కోరారు. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి ఆక్వా రైతులను ఆదుకోవాలని రాష్ట్రం మొత్తం మీద ఐదు జిల్లాల్లోనే ఈ చార్జీలు అమలులో ఉన్నాయని, విద్యుత్ ఉన్నతాధికారులు గమనించి ఆక్వారైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నల్లా సత్యకృష్ణకిరణ్‌ప్రసాద్, రాపూరి నాగు, రేపూరి ఏసు, దొంగ ఏసు, దెందుకూరి శ్రీహరిరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఆక్వారైతులు తదితరులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లి విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందిస్తున్న ఆక్వారైతులు

భవన నిర్మాణరంగ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- పెండింగ్‌లో ఉన్న 46వేల క్లైమ్‌లకు నిధులు మంజూరు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన భవన నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న 46వేల క్లైమ్‌లకు నిధులు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం దారి మళ్లించిన రూ.1200కోట్ల నిధులను తిరిగి బోర్డుకు జమ చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడ్డ కార్మికుల సంక్షేమ బోర్డును వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కార్మికులకు సంక్షేమ పథకాలను పునఃప్రారంభించాలని, భవన నిర్మాణదారులు చెల్లించే సెస్‌తో నడుస్తున్న సంక్షేమ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోనం చిన్నా, ప్రధాన కార్యదర్శి నాగార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఎస్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల ఆప్కాస్ కార్పొరేషన్ ఎత్తివేస్తే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా మున్సిపల్ శాఖ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణరంగ కార్మికులు

అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలి..

పేరూరు శివారు విశ్వేశ్వర అగ్రహారంలోని చంద్రబాబునాయుడు కాలనీలో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని జేసీ నిషాంతికి అర్జీ అందజేశారు. దేవస్థానానికి చెందిన రెండున్నర ఎకరాల భూమిలో ప్రభుత్వం 1995లో ఇళ్లస్థల పట్టాలు మంజూరు చేసిందని, కొంత ఖాళీ స్థలాన్ని సామాజిక భవనానికి కేటాయించారని పేర్కొన్నారు. ఆ స్థలంలో మాజీ కార్యదర్శితో పాటు కొందరు ఇళ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టారని, దీనిపై గత ఏడాది డిసెంబరు 16న కలెక్టరేట్‌లో అర్జీ అందజేశామన్నారు. అప్పట్లో పంచాయతీ కార్యదర్శి యిళ్ల నిర్మాణాన్ని నిలుపుదల చేసినా తిరిగి ఆక్రమదారులు నిర్మాణ పనులు చేస్తున్నారని, ఇందుకు పేరూరు వీఆర్వో సహకరిస్తున్నట్టు కాలనీవాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్జీ అందించిన వారిలో కె.శ్రీలక్ష్మీ, జి.వరలక్ష్మి, కె.అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ పట్ల పూర్తి అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణ పట్ల పూర్తి అవగాహన కల్పించుకుని పోలింగ్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం పోలింగ్ సిబ్బంది రెండోదశ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్, మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు డివిజన్‌లోని పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ శిక్షణలో సందేహాలుంటే అప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ సమయంలో తలెత్తే వివిధ సమస్యలను ఎలా పరిష్కరించాలో వివరించారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని ఎలా తీసుకువెళ్లాలి, తిరిగి ఎలా తీసుకురావాలో వివరించారు. పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘవులు ఓటర్లను అభ్యర్థించారు. మాచవరం, అంబాజీపేట గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కె.పెదపూడి గ్రామంలో ప్రచారం నిర్వహిచారు. మైపాల తాతాజీ, దొమ్మేటి శ్యామ్, కత్తుల బాబులు, నైనాల ప్రభాకర్, నేదునూరి రాజకుమార్, మందా రాజేష్, చిక్కం పల్లంరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పి.గన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్.ఏనుగుపల్లి, పోతవరం, ముంగండ గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు షేక్ సుభాన్‌తో కలిసి నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బెల్లంపూడి పరిసర గ్రామాల్లో జడ్పీ ఉన్నత పాఠశాలలు, స్టార్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో రాజశేఖర్‌కు ఓటు వేయాలని టీడీపీ రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి నక్కా సునీల్‌రాజు అభ్యర్థించారు. సంసాని పెద్దిరాజు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, పెచ్చెట్టి వెర్రియ్య, అంబటి కోటేశ్వరరావు, శేరు శ్రీనుబాబు, యండ్ర శ్రీనివాస్, కడలి శంకరం, వాసంశెట్టి రమణ, యడ్ల ఏసు, చీకట్ల అర్జునరావు, కుసుమ నాగేశ్వరరావు, యల్లమిల్లి నాగేంద్ర పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించాలి

అంతర్వేది, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని కూటమి శ్రేణులు గ్రామాల్లో ప్రచారం చేశారు. టేకిశెట్టిపాలెంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ ప్రచారం నిర్వహించారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాజశేఖర్‌కు విజయం చేకూరాలని టీడీపీ సభ్యులు కాశి దుర్గాప్రసాద్, యలమంచిలి సూర్యప్రకాష్, కాగిత సునీల్, రేవు చిన్నబాబి స్వామివారిని వేడుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల్లో కూటమి శ్రేణులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రచారం నిర్వహించారు. ముత్యాల ప్రసాద్, వీసా తాతయ్యనాయుడు పాల్గొన్నారు.

విజయవంతంగా ఐఓటీ హ్యాకథాన్



భట్లపాలెం బీవీసీలో ఐఓటీ హ్యాకథాన్ వర్క్‌షాప్ చేస్తున్న విద్యార్థులను ప్రశ్నిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులు ఐఓటీ హ్యాకథాన్ వర్క్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. 64మంది విద్యార్థులతో పాటు పలువురు ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు. సోమవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ అగ్రికల్చర్, హెల్త్‌కేర్ అండ్ హోమ్ ఆటోమేషన్, రియల్-వరల్డ్ సవాళ్లపై ఐఓటీ ఆధారిత పరిష్కార మార్గాలను అభివృద్ధి చేసి వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఈనెల20 నుంచి నాలుగు రోజుల పాటు వర్క్‌షిప్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు తెలిపారు. మేక్ స్కిల్ కంపెనీకి చెందిన కె.రేవంత్‌కుమార్ రెడ్డి, జి.శివసాయిలు ముఖ్య అతిథులుగా హాజరై పరిష్కార మార్గాలను పరిశీలించారు. కోఆర్డినేటర్ ఎం.ఆదిలక్ష్మీదేవి, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం చినకొల్లేరుగా పిలువబడే కేశవదాసుపాలెం-మెండుపాలెంలో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి ఉత్సవాలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 28వరకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతాయని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం ఆలయ సహాయ కమిషనర్, జిల్లా ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వెంకట శాస్త్రి, అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 11.46గంటలకు ఆలయ ఆసాది సమక్షంలో పందిరాట ముహూర్తం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈనెల28న అమ్మవారి ఆలయం వద్ద వివిధ హక్కుల కోసం టెండర్లు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజోలు సీఐ టీవీ నరేష్, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, ఎస్ఐలు కె.దుర్గాశ్రీనివాస్, పి.సురేష్, విశ్రాంత ఈవో బి.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ విజయసారథి పాల్గొన్నారు.



ఆలయం వద్ద సమావేశమైన దేవదాయ శాఖ అధికారులు, పోలీసులు

మహాకుంభమేళా యాత్ర డ్రైవర్లకు సన్మానం



కుంభమేళా యాత్ర దిగ్విజయం చేసిన డ్రైవర్లను సన్మానించిన జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు, డీపో మేనేజర్ మూర్తి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాకుంభ మేళా యాత్రకు వెళ్లి వచ్చిన 12మంది ఆర్టీసీ డ్రైవర్లను జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్ల అభినందన సభ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా యాత్రకు వెళ్లి యాత్రికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన డ్రైవర్లను ఆయన అభినందించారు. 4100కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ గంగుమళ్ల రమాలక్ష్మీదేవి, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎన్.వరహాలబాబు పాల్గొని ఆర్టీసీ డ్రైవర్లను సత్కరించారు.

ఉపాధ్యాయుల నుంచి ప్రాథమిక సమాచారం తీసుకున్నాం

-జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా

పి.గన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ముంగండ హైస్కూల్లో హెచ్ఎంకు, ఉపాధ్యాయులు మధ్య నెలకొన్న వివాదంపై స్థానిక ఉపాధ్యాయుల నుంచి ప్రాథమిక సమాచారాన్ని తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సలీం భాషా తెలిపారు. ముంగండ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయిని జి.కనకదుర్గ ఒత్తిడితోనే బయోలజికల్ ఉపాధ్యాయురాలు లావణ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపిస్తూ ఉపాధ్యాయులు నిరసన తెలిపిన ఘటనపై విచారణ నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడారు. హెచ్ఎం వద్ద పని చేయడానికి భయమేస్తోందని ఉపాధ్యాయులు వాపోయినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల నుంచి సేకరించిన సమాచారాన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం హెచ్ఎం జి.కనక దుర్గ పది రోజులు సెలవుపై వెళ్లారని తెలిపారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి

యానాం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి దాతలు ముందుకు రావాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని అనంతరం పునఃనిర్మాణ కమిటీ ప్రతినిధి, ఆలయ అర్చకులు, ప్రముఖుల ఆధ్వర్యంలో దాతల వివరాలకు సంబంధించిన ఆలయ కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మల్లాడి మాట్లాడుతూ దాతలు సమకూర్చిన రూ.2.71కోట్లు, తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.3కోట్లు మొత్తం రూ.5.71కోట్లతో తొలివిడత పనులకు టీటీడీ శ్రీకారం చుట్టిందన్నారు. మొదటి విడత ఆలయ పనులు జూలై 2025నాటికి పూర్తవుతాయి. రెండో విడతతో కల్యాణమండపం, గుడి ముందు ముఖమండపం, వాహనశాల ఆలయం చుట్టూ ఎనిమిది అడుగుల ఎత్తున రాతిపై చెక్కిన శిల్పాలతో పాటు ఆలయం నాలుగుపక్కలా వేంకటేశ్వరస్వామి చరిత్ర తదితర నిర్మాణాలు చేపడతారు. వీటికి రూ.8కోట్లు ఖర్చు అవుతుంది. దాతలు నగదు జమచేసి రశీదు పొందాలన్నారు. డీడీలు, చెక్కుల రూపంలో ఇచ్చేవారు శ్రీవెంకటేశ్వరస్వామి అలివేలు మంగాదేవి గర్భాలయం పేరున ఇండియన్ బ్యాంక్ అకౌంట్ నెం.6727946131 యానాం శాఖకు డిపాజిట్ చేయాలన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకుల పాల్గొన్నారు.



ఆలయ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మల్లాడి తదితరులు

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భాషా-సంఖ్యల పునాది జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం సోమవారానికి ఆరో రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్స్‌కు అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేసేందుకు మండలస్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం బాల్యారంబ సంరక్షణ విద్య, గ్రాడ్యుయేషన్, పాఠశాలల సంసిద్ధత మేళా వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల సంసిద్ధతత కార్యక్రమంలో పేరు నమోదు, శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధా అభివృద్ధి, గణిత నైపుణ్యం, సామాజిక భావోద్వేగాల అభివృద్ధిలో కృత్యాలు ప్రదర్శించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎంవో రాంబాబు, మండల విద్యాశాఖాధికారి ఆర్.ఉదయభాస్కర్, తాడి కృష్ణారెడ్డి, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేత విశ్వేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాదుకు చెందిన తల్లాప్రగడ వెంకట్రాజు దంపతులు రూ.1,00,116లు సోమవారం ఆలయ పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజుకు అందించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో దాత దంపతులకు దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.



ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్‌ను నిరసిస్తూ రిలే దీక్ష



ఆర్టీసీ డిపోలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ ప్రతినిధులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో పనిచేస్తోన్న డ్రైవర్ బీఎస్ నారాయణను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వారం రోజులుగా నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు వివిధ రకాలుగా నిరసనలు తెలిపారు. అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి నారాయణను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ డిపోలో యూనిటీ ప్రతినిధులు పి.రాంబాబు, నారాయణ, జీఎస్.రావు, సీహెచ్ వీఎస్ నారాయణ, బి.రమణ తదితరులు రిలే దీక్ష చేపట్టారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నినాదాలు చేశారు.

పార్వతీ రామేశ్వరునికి బలిహరణ పూజలు

అల్లవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీరాముని శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి పొందిన ఎస్.రామేశ్వరంలోని పార్వతీ రామేశ్వరస్వామికి సోమవారం బలిహరణ పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం రాత్రి పార్వతీ రామేశ్వరుని కల్యాణం జరిగింది. చైర్మన్ అంగాని రామారావు-రామలక్ష్మి దంపతులచే పుల్లేటికుర్తి శంకరం బ్రహ్మత్వాన రామేశ్వరస్వామి కల్యాణం జరిగింది. 26వ తేదీన శివరాత్రి సందర్భంగా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. 27వ తేదీ రామేశ్వరస్వామికి త్రిశూల స్నానం జరుగుతుందని ఆలయ పురోహితులు హనుమఫణి, ఉమాశంకరం తెలిపారు.

22 మండలాల్లో అంగన్‌వాడీలకు శిక్షణ

అల్లవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 22మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు చెప్పారు. ప్రతీ విద్యార్థి తరగతి గది అభ్యసనా సామర్థ్యాలను సాధించాలని అందుకు జ్ఞాపకాలు దోహదం చేస్తాయన్నారు. అల్లవరం జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ నిర్వహించారు. చిన్నతనంలోనే విద్యార్థులకు భాషాగణిత భావన పట్ల పట్టు సాధించే విధంగా బోధనలు సాగించాలన్నారు. మండల విద్యాధికారి కె.కిరణ్‌బాబు, ఎస్.ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయుడు నయినాల వెంకటేశ్వరరావు, డీఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన 23మంది యువకులు

పి.గన్నవరం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): కుందాలపల్లి శివారు పప్పులవారిపాలెం శ్రీస్వామి వివేకానంద యోగా ఆశ్రమం గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో 23మంది యువకులు రక్తదానం చేశారు. ఇప్పటివరకు 23వేలకు పైగా రోగులకు రక్తదానం చేశామని శ్రీనివాస్ చెప్పారు. పి.అనిల్, ఎం.కార్తిక్, బి.ధనుంజయ, సి.మాలిని, ఎన్.దుర్గేష్, ఎ.బాబి, ఎం.సాయి, ఎన్.బాలు, పి.ఆది పాల్గొన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల యాక్టు 2025కు సవరణలు తీసుకుని రావడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులంతా విధులు బహిష్కరించి ముమ్మిడివరం కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సవరణ చట్టంలో న్యాయవాదులు సమ్మె చేసే హక్కును రద్దు చేయడం, బార్ కౌన్సిల్‌పై హైకోర్టు, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తులు, ఇతర వ్యక్తుల ప్రమేయం కల్పించడం అప్రజాస్వామికమని, ఇది న్యాయవాదులకు ఆమోదయోగ్యమైంది కాదని పేర్కొన్నారు. దోనిపాటి ఆంజనేయులు, ఎంటీ ప్రసాద్, ఈఎస్ బాబు, వీవీ విజయచక్రవర్తి, తిరుకోటి శాంతిసుధ, జి.శ్రీనివాసరావు, ఎం.ఆలీహసన్, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్వీ శాస్త్రి, కె.సింహాద్రివర్య, కె.సిద్ధార్థకుమార్, కె.బాబూజగ్జీవన్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి సోమవారం మానేపల్లికి చెందిన ఉండవల్లి రాఘవేంద్రరావు-సరస్వతి దంపతులురూ.11,116విరాళం అందించారు. దాత భక్తులకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ విజేత 'రాధాలెవెన్'

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జీఎంసీ బాలయోగి క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను నియోజకవర్గ స్థాయిలో అమలాపురం బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. రాజీవ్, చిన్నా, బాబి, నాయకుడు సారథ్యంలో 32జట్లతో ఈపోటీలు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఫైనల్స్ పోటీల్లో రాధాలెవెన్-చందూలెవెన్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరకు రాధాలెవెన్ జట్టు టోర్నీ విజేతగా నిలిచి మొదటి బహుమతిగా రూ.30వేలుతో పాటు ట్రోఫీని కైవసం చేసుకోగా తాలూకా సీఐ ప్రశాంతకుమార్ వాటిని అందజేశారు. రెండో బహుమతిగా చందూ లెవెన్ జట్టుకు రూ.15వేలు, ట్రోఫీను కోనసీమ కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కారెం రవితేజ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి టీఎస్ సురేష్ కుమార్ అందించారు. కార్యక్రమంలో లింగోలు వీరరాజ్, కిశోర్, పేరాబత్తుల ఫణి, యాళ్ల రవి, లింగోలు కృష్ణ, పెయ్యల సాయి, చిత్రపు అజయ్, కొప్పుల ప్రశాంత్, మెండి డేవిడ్ అంబేడ్కర్, చిత్రపు జయరాజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల్లో భాగస్వాములు కావాలి

అయినవిల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా స్వచ్ఛ గ్రామాల్లో భాగస్వాములు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు అన్నారు. సోమవారం ఎస్.మూలపొలంలో తడి చెత్త-పొడి చెత్తపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పంచాయతీ మండల విస్తరణాధికారి వాణిశ్రీ బెహరా, సర్పంచ్ బొబ్బా ప్రభాత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సభ్యులు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

జీవీ సుందర్ విజయానికి కృషిచేయాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న జీవీ సుందర్‌కి ఓటువేసి గెలిపించాలని మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రాడ్యుయేట్లు అందరికీ ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. మాజీ పార్లమెంటు సభ్యుడు జీవీ హర్షకుమార్ బలపరిచిన జీవీ సుందర్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మెండి కృష్ణంబాబు, ఎంవీ సూర్యం, బుడితి సత్తిబాబు, నీలం చినబాబు, ఎం.దుర్గాప్రసాద్, జి.గౌతమ్ పాల్గొన్నారు.

ధనలక్ష్మి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



రాకేష్, రష్మిక దంపతులు ఆశీర్వదిస్తున్న ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి

యానాం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్ రామరాజు గార్డెన్స్‌లోని ధనలక్ష్మీ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వాహకులు చింతా బుల్లియ్య, చింతా వెంకటగణేష్(ఎన్ఆర్ఐ), శివ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చింతా రాకేష్, రష్మిక దంపతులు, చింతా శివ నాగరత్న కుమారి, చింతా నితేష్, శార్వణి దంపతులు హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం చింతా కుటుంబ సభ్యులు మల్లాడిని ఘనంగా సత్కరించారు. యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీఅన్నపూర్ణాకాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

కాట్రేనికోన, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉప్పూడిలో రంబాల వెంకట సూర్యగోపాలకృష్ణమూర్తి, పాపాయమ్మ దంపతులు నిర్మించిన ఆలయంలో సోమవారం శ్రీఅన్నపూర్ణాకాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకుడు చంద్రమౌళి రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కాళ్ళకూరి కామేశ్వరరావు ఆచార్యత్వంలో రంబాల చిట్టిబాబు, గంగాభవాని, సూరిబాబు, రామలక్ష్మీలలితకుమారి, రాంబాబు, వెంకటలక్ష్మి దంపతుల నిర్వహణలో జరిగిన కల్యాణ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దళిత చైతన్యవేదిక సేవలు ప్రశంసనీయం

రాజోలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దళిత చైతన్య జిల్లా వేదిక చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు అన్నారు. చింతలపల్లిలో జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో దళిత చైతన్యవేదిక పేబ్యాక్ టూ ద సొసైటీ ప్రోగ్రాంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డి.జానకీరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 34మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, ఎరైజర్లు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, మట్టా సురేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురం సావరం బైపాస్ రోడ్డులో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. సరెళ్ల నాగలక్ష్మికి చెందిన దాబా ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళతో పాటు ఇద్దరు విటులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి ఆటో, మోటారు సైకిల్, రూ.1300 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సోమవారం సీఐ తెలిపారు. నిందితులను అమలాపురం ఏజేఎఫ్‌సీఎంకోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగికి విద్యుత్‌షాక్

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తోన్న కాండ్రేగుల శ్రీమణికంఠ సోమవారం బాలయోగి కాల్వగట్టు సాయిబాబా ఆలయం వద్ద విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడి నుంచి కింద పడిపోయాడు. అతడి తలకు తీవ్ర గాయం కాగా తోటి సిబ్బంది ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌ఏ మునిస్వామితో ఎమ్మెల్యే గొల్లపల్లి భేటీ

యానాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో పెండింగ్ అంశాలపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భేటీ అయ్యారు. ముఖ్యంగా యానాం వెంకన్న ఆభరణాలు అంశాలపై చర్చించారు. అదేవిధంగా హెచ్ఆర్ సంస్థ సేకరిస్తున్న చెత్తను కనకాలపేట డంపింగ్ యార్డులో వేయడం లేదు, ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేని ప్రాంతంలో స్థలం కేటాయించాలని ఇప్పటికే ఎనిమిది నెలలు సమయం ఇచ్చిన ప్రభుత్వం ఎలాంటి ముందస్తు పనులు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గణపతినగర్ రోడ్డు సమస్యను ఇరువురిని సంప్రదించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిష్కారించాలని కోరారు.

టి.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం టి.కొత్తపల్లి, దుప్పిలంక, పండువారిపేటల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలంటూ గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి అభ్యర్థించారు. కార్యక్రమంలో పండు రాంజీ, సంగాని ప్రసాద్, నడింపల్లి సత్యనారాయణరాజు, నక్కా రామకృష్ణ, ఉద్దిశ రామకృష్ణ, కొర్లపాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషిచేయాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కూటమి నాయకులంతా కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు పి.కోటేశ్వరరావు సూచించారు. ముమ్మిడివరంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నాయకులను కలిసి పలు సూచనలిచ్చారు. ఎమ్మెల్సీ ఓటర్లు ఎంత మంది ఉన్నారు తదితర వివరాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు దొమ్మేటి రమణకుమార్, టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు గొల్లపల్లి గోపి, గెద్దం శ్రీనివాసరావు, చిక్కాల పరశురామ్, కడలి వీరంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు కోరారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి మగటపల్లిలో ప్రచారం నిర్వహించారు. కూటమి పాలన చూసి ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని కోరారు.

డ్రగ్ ట్రేడ్ సంయుక్త కార్యదర్శిగా సుబ్బారావు



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా డ్రగ్ ట్రేడ్ యూనియన్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా అమలాపురం పట్టణానికి చెందిన మోకా వెంకటసుబ్బారావును నియమించారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేయగా పలువురు అభినందించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పేరవరం గోదావరి ప్రాంతంలో సోమవారం సారా తయారీకి సిద్ధంగా ఉన్న 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ కె.అన్నవరం తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని హెచ్చరించారు.

నిధులు అందకుండా అభివృద్ధి ఎలా?

• గత ప్రభుత్వ నిర్వాకంతో పూర్తిగా అందని 15వ ఆర్థిక సంఘం నిధులు • ఆవేదనలో సర్పంచ్‌లు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు...గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. పంచాయతీలకు నిధులు పుష్కలంగా ఉంటేనే పల్లెలు అభివృద్ధి బాటపడతాయి. పంచాయతీలకు అందిస్తున్న ఆర్థిక సంఘం నిధులు అంతంత మాత్రంగా రావడంతో మైనర్ పంచాయతీల అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా అందకపోవడంతో నిధులు లేక పనులు చేపట్టలేని పరిస్థితి దాపురించింది. వైసీపీ హయాంలో నాలుగేళ్ల నుంచి పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన స్టాంపు డ్యూటీ నేటికీ రాకపోవడంతో పంచాయతీ పాలన గాడితప్పుతున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లోని 322 గ్రామాల్లో పంచాయతీలకు స్టాంపు డ్యూటీ నిధులు జమచేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.15 నుంచి 20 కోట్ల పైబడి స్టాంపు డ్యూటీ నిధులు మండల పరిషత్, పంచాయతీలకు జమ కావాల్సి ఉంది. గ్రామాల్లో రెవెన్యూ భూములు, ఇళ్ల స్థలాల క్రయ విక్రయాలపై ఒక శాతం సెస్‌ను రిజిస్ట్రేషన్ శాఖ కొనుగోలుదారుల నుంచి వసూళ్లు చేసి గ్రామ పంచాయతీలకు జమ చేయడం స్వాతంత్ర్య వచ్చినప్పటి నుంచి అమలులో ఉంది. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు స్టాంపు డ్యూటీ నిధులు జమ చేయకుండా అర్ధాంతరంగా నిధులు నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో వాటి కోసం పంచాయతీలు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల మండల పరిషత్ సమావేశంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న స్టాంపు డ్యూటీ నిధులపై సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. మండల పరిషత్‌లో సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పందించి వెంటనే జిల్లా రిజిస్ట్రార్‌తో ఫోన్‌లో స్టాంపు డ్యూటీపై మాట్లాడారు. త్వరలో నిధులు జమ చేస్తామంటూ ఫోన్‌లో జిల్లా రిజిస్ట్రార్ ఎమ్మెల్యే కు హామీ ఇచ్చారు. నేటికీ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు స్టాంపు డ్యూటీ నిధులు జమకాకపోవడంతో సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతున్నారు.


ఆత్రేయపురం మండలం పరిషత్ కార్యాలయం


ఆర్డీవో అఖిలకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌వోలు

సచివాలయ ఉద్యోగులను భాగస్వామ్యం చేయండి

ఆర్డీవోకు వీఆర్‌వోల వినతిపత్రం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వీఆర్‌వోలకు గ్రామస్థాయిలో జరిగే సర్వేలు, పనుల్లో సచివాలయ ఉద్యోగులను, కార్యదర్శులతో సహ భాగస్వామ్యం చేయాలని వీఆర్‌వోలు సోమవారం రామచంద్రపురం ఆర్డీవో అఖిలకు వినతిపత్రం ఇచ్చారు. ఎంఎస్ఎంఈ సర్వే ప్రారంభించలేదని వీఆర్‌వోలకు రామచంద్రపురం ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఆర్డీవోకు వీఆర్‌వోల సమస్యలపై తెలిపారు. రెవెన్యూతోపాటు జీఎస్‌డబ్ల్యుఎస్ శాఖ నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయడంలో వీఆర్‌వోలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీఆర్‌వోలు సచివాలయ వ్యవస్థలో అంతర్భాగంగా పేర్కొంటూ సందేశాలు పంపుతున్నారని దీంతో ఒత్తిడికి గురవుతున్నామని వారన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, రామచంద్రపురం మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.2.90 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,90,121 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో ఎన్.సూర్యచక్రధరరావు తెలిపారు.

వైభవంగా సంఘమేశ్వరస్వామి రథోత్సవం

మండపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ఏడిద సంఘమేశ్వర స్వామి రథోత్సవాన్ని సోమవారం వైభవంగా జరిపారు. రథం సెంటరు నుంచి సంఘమేశ్వరస్వామి ఆలయం వరకు అశేష భక్తజనం మధ్య ఊరేగింపు సాగింది. ముందుగా స్వామివారికి పూజల అనంతరం గ్రామస్తులు, భక్తులు గ్రామం నుంచి సంఘమేశ్వర స్వామి ఆలయం వరకు రథాన్ని చేర్చారు. శివరాత్రి వరకు ఈ రథం సంఘమేశ్వరంలోనే ఉంటుందని తెలిపారు. శివరాత్రి ముగిసిన తర్వాత తిరిగి ఏడిదకు రథం చేరుకుంటుంది. రథోత్సవం సందర్భంగా గ్రామంలో విద్యుత్ సరఫరాను సోమవారం ఉదయం నుంచి నిలిపి వేశారు. రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సంఘమేశ్వరస్వామి రథోత్సవం దృశ్యం

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయ అంతఃప్రాంగణంలో ఉన్న అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి జరిగింది. ఉదయం 9.12 గంటలకు కల్యాణమూర్తులను ఆహ్వానించారు. సాయంత్రం 4.25 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం జరిగింది. రాత్రి కల్యాణ వేదికపై కల్యాణమూర్తులను అధిష్ఠింపచేశారు. దేవులపల్లి పణిరామకృష్ణచే గణపతి పూజ, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, 7.45 గంటలకు సుమూహూర్తం నిర్వహించారు. మాంగల్య ధారణ అనంతరం తలంబ్రాలు, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కాకర్లపూడి రాజగోపాల నరసరాజు, ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, అర్చకులు కొంతేటి బాల సుబ్రహ్మణ్యశర్మ, విశ్వనాధ శర్మ, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం చేస్తున్న దృశ్యం


సోమేశ్వరస్వామి ఆలయం వద్ద వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

భక్తుల దాహార్తి తీరుస్తున్న దాతలు అభినందనీయులు

కె.గంగవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆలయాలకు వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు దాతలు వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయం అని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామి ఆలయం వద్ద ఓలేటి సుబ్రహ్మణ్యం రూ.లక్షతో కూలింగ్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. దీన్ని మంత్రి సుభాష్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సుభాష్ సేవా సమితి సభ్యులు గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్, రాము, టీడీపీ సీనియర్ నాయకుడు వెంటూరు వీర్రాఘవులు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరం హైస్కూల్‌లో మహిళా సంరక్షణపై అవగాహన

రాయవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళా సంరక్షణపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ డి.సురేష్ బాబు బాలికలు ఎదుర్కొనే ఈవ్ టీజింగ్, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాకొప్పేశ్వరస్వామి కల్యాణం

కొత్తపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పలివెల ఉమాకొప్పిలింగేశ్వరస్వామి కల్యాణాన్ని సోమవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. స్వామివారికి కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు పట్టువస్త్రాలు అందించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. ఆలయ ఈవో ఎస్.శివ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.


స్వామివారికి పట్టువస్త్రాలు అందిస్తున్న కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్ దంపతులు


వేలంపాట నిర్వహిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి ప్రసాద్

సీజ్ చేసిన వాహనాల వేలం

ఆలమూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు కేసులలో సీజ్ చేసిన వాహనాలకు సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కెడీవీ ప్రసాద్, ఆలమూరు సీఐ ఐడీ నాగేశ్వరరావు, ఎస్‌ఐ రాంబాబుల సమక్షంలో వేలం నిర్వహించారు. ఆరు ద్విచక్ర వాహనాలకు జరిపిన ఈ వేలంలో రూ.85వేలకు ఖరారు చేశారు. డీడీ చెల్లించి వాటిని తీసుకెళ్లవచ్చునని తెలిపారు.


పసలపూడిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పసలపూడిలో ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రాయవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామ శివారు బైపాస్ రోడ్డులో ఉన్న దుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. గ్రామానికి చెందిన పోతంశెట్టి దుర్గాప్రసాదరెడ్డి, భవ్యశ్రీ దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. అర్చకులు విష్వక్షేనపూజ, పుణ్యాహ వచనం తదితర పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో పోతంశెట్టి జయలక్ష్మి, పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, శ్రీదేవి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వసంతవాడ పార్వతీ, పరమేశ్వరులను ఫల, పుష్పాలతో అలంకరించిన దృశ్యం

శివ, పార్వతులకు ప్రత్యేక అలంకరణ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వసంతవాడ పార్వతీ, పరమేశ్వరుల ఆలయంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే శివరాత్రి వేడుకల్లో భాగంగా రెండో రోజు విఘ్నేశ్వర పూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఫలపుష్పాలతో అలంకరణ విశేషంగా నిర్వహించారు. మహాశివరాత్రికి అన్ని ఏర్పాట్లు నిర్వాహకులు చేపడుతున్నారు.

నేటి నుంచి త్రయంబకేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అంగర పడమరఖండ్రిక ఉయ్యాల - జంపాల క్షేత్రం వద్దనున్న అన్నపూర్ణ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయం 13వ వార్షిక కల్యాణోత్సవం, మహాశివరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8.30 గంటలకు వార్షిక కల్యాణోత్సవం, 26న మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి మహోత్సవం తదితర కార్యక్రమాలు కొమాళ్ళపల్లి సత్యానారాయణమూర్తి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. కొత్తలంకకు చెందిన శ్రీకంఠం ప్రభాకర శర్మ, ప్రధాన అర్చకులు కొమాళ్ళపల్లి సత్యసుబ్రహ్మణ్యం తదితరుల పర్యవేక్షణలో ఆయా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తడిపొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కోరారు. స్వచ్ఛ మండపేట లక్ష్యంగా పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు ప్రజలు తమకు సహకరించాలని కోరారు. సోమవారం పట్టణంలోని ఆరో వార్డులో పర్యటించి తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వాడవద్దని గుడ్డ సంచులు వాడాలని ఆయన కోరారు. ఆయన వెంట మెప్మా సీఎంఎం సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మత్యాల సత్తిరాజు, సచివాలయ ఉద్యోగులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు మీద చెత్త వేసినందుకు ఒక వ్యాపారికి రూ.300 జరిమాన విధించామని ఆయన తెలిపారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు


కె.గంగవరం అంగన్‌వాడీ శిక్షణలో బోధనోపకరణాలు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కె.గంగవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ల శిక్షణను సద్వినియోగం చేసుకుని కేంద్రాల్లోని పిల్లలను శ్రద్ధగా చూసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వరాహలక్ష్మి అన్నారు. సోమవారం కె.గంగవరం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణను ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం, బోధనోపకరణాలు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంఈవో ఏ. నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు చిన్నప్పటి నుంచే విద్యపై ఆసక్తి కలిగేలా అంగన్‌వాడీలు కృషి చేయాలని ఏఎస్వో రాంబాబు అన్నారు. రావులపాలెం జడ్పీ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణను ఆయన సందర్శించారు. విద్యార్థులకు విద్యపట్ల ఆసక్తి కలిగేలా కృషి చేయాలన్నారు.


రావులపాలెంలో అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాంబాబు

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే చిన్నారులకు అభ్యాసం పూర్తిగా నిర్వహించాలని సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు కోరారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంఈవో ఎం.హరిప్రసాద్, పాఠశాల హెచ్ఎం ఎస్.సత్యనారాయణ, డీఆర్పీలు ఏ.దుర్గాప్రసాద్, ఏవీబీ లింగం, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బడుగువానిలంకలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

కూటమి అభ్యర్థిని గెలిపించాలని జనసేన ప్రచారం

ఆలమూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా జనసేన పార్టీ విస్తృత ప్రచారం చేస్తోంది. సోమవారం మండలంలోని బడుగువానిలంకలో మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పేరాబత్తులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గారపాటి శ్రీనివాస్, పడాల అమ్మిరాజు, శివశంకర్, మందపల్లి సోమశేఖర్, నాగిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి గ్రామోత్సవంలో భక్తుల సందడి

కొత్తపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మందపల్లి ఉమా మందేశ్వరస్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని స్వామివారి గ్రామోత్సవాన్ని సోమవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, నృత్య ప్రదర్శనలు, అమ్మవారి వేషధారణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి జరిగే కల్యాణానికి ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.


శనేశ్వరస్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు


ర్యాలీ ఉమా కమండలేశ్వరస్వామి

ముస్తాబైన ఉమాకమండలేశ్వర స్వామి ఆలయం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. రుద్రాక్ష ఆకారంలో స్వయంభూ లింగమైన ర్యాలీ ఉమాకమండలేశ్వర స్వామి ఆలయం ప్రాచుర్యం సంతరించుకుంది. కేశవస్వామి ఆలయంలో స్వామివారి పాదాల చెంత జలం ఉద్భవిస్తుండగా ఉమా కమండలేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం చేస్తుండగానే గర్భంలోనే ద్రవం ఇంకిపోతుంది. మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొంటారు. లింగోద్భవ కాలంలో అభిషేకాలు నిర్వహించనున్నారు. శివరాత్రికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు.


నియామక పత్రాలు అందిస్తున్న సత్యం

నిరుద్యోగులకు నియామక పత్రాల అందజేత

ద్రాక్షారామ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 28 మంది నిరుద్యోగులకు సోమవారం నియామక పత్రాలు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జైస్నా టెక్నాలజీస్ ప్రతినిధుల సమక్షంలో నిరుద్యోగలకు ఆయన అందించారు. ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించిన సత్యం ఫౌండేషన్ చైర్మన్ సత్యంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


టైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన రావులపాలెం సిద్ధార్థ విద్యార్థులు

టైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా టైక్వాండో పోటీల్లో రావులపాలెం సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కోచ్ టి.వెంకటలక్ష్మి తెలిపారు. ఇటీవల పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే, కింగ్‌ఫూ, టైక్వాండో పోటీల్లో పాల్గొన్న సత్తి విజయరెడ్డి వెపన్స్ నాన్‌చాక్ విభాగంలో మొదటిస్థానం ఎల్లో బెల్ట్, కర్రి లీలాశ్రీ ప్రణీత్‌రెడ్డి రెండో స్థానం సాధించారన్నారు. విద్యార్థులను డైరెక్టర్ కె.ముల్లారావు, ఏవో ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.


కూళ్లలో పూజలు చేస్తున్న పండితులు

భక్తి శ్రద్ధలతో లక్షతులసి పూజ

కె.గంగవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల గ్రామంలోనున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్షతులసి పూజ జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వస్తివాచకం, విశ్వక్సేనపూజ, పుణ్యాహ వచనం, పంచామృత స్నపనము, మండపారాధన, కుంభపూజ తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

ఆక్రమణల తొలగింపు

మండపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం వెలగతోడు గ్రామంలో ఇరిగేషన్ శాఖకు చెందిన మాంటిక్ క్లియర్ కాల్వ పక్కన వున్న మూడు ఆక్రమణను సోమవారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. ఇరిగేషన్ డీఈఈ ఆనంద్ కుమార్, బిక్కవోలు జేఈ షబీనా నేతృత్వంలో మండపేట రూరల్ పోలీసుల బందోబస్తు మధ్య చికెన్ దుకాణంతో పాటు రెండు బార్బర్ దుకాణాలను తొలగిం చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. ఇటీవల ప్రజా ఫిర్యాదుల్లో వచ్చిన ఫిర్యాదుపై ఆక్రమణలు తొలగించామని వారు తెలిపారు.